నూతన సంవత్సర వేడుకలకు సిద్ధం



వేడుకలకు ముస్తాబైన పార్టీ పెదఅమిరం కార్యాలయం

కాళ్ల: కొత్త ఏడాది సందడి నెలకొంది. నియోజకవర్గ స్థాయి నేతలు నూతన సంవత్సర వేడుకలకు ఏర్పాట్లు పూర్తిచేశారు. పెదఅమిరం గ్రామంలో డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నరసింహరాజు, కార్యాలయాల వద్ద, వైఎస్సార్‌సీపీ ఆఫీసుల వద్ద సర్వం సిద్ధం చేశారు. పార్టీ శ్రేణులు, అభిమానులకు విందు ఏర్పాట్లు చేస్తున్నారు.

పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీనివాస్



పాల్గొన్న వలంటీర్లు, సచివాలయ కన్వీనర్లు, రథసారథులు

ఎమ్మెల్యే శ్రీనివాస్

సాక్షి, భీమవరం: విశ్వసనీతకు, నమ్మకానికి నిలువుటద్దం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ అన్నారు. భీమవరం నియోజవర్గ స్థాయి వలంటీర్లు, సచివాలయ కన్వీనర్లు, రథసారథులతో శనివారం స్థానిక మార్కెట్ యార్డులో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సంక్షేమ పథకాల లబ్ధిని పారదర్శకంగా అర్హుల ఖాతాల్లో జమవుతోందని, పాలనను ప్రతి ఇంటి ముంగిటకు తీసుకువెళ్లేందుకే సచివాలయ, వలంటీర్ వ్యవస్థ ఏర్పాటు చేశారని వివరించారు. సీఎం జగన్ ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీనీ అమలు చేస్తున్నారని, పింఛన్ సొమ్ము రూ.2,750కు పెంచారని శ్రీనివాస్ చెప్పారు. టీడీపీ అధినేత చంద్రబాబు చేసిన మోసాలవల్లే గత ఎన్నికల్లో ప్రజలు ఆపార్టీకి 23 సీట్లకే పరిమితం చేశారని గుర్తుచేశారు. వైఎస్సార్‌సీపీ కోసం కష్టపడి పనిచేసిన వారికి ఎప్పుడూ అన్యాయం జరగదన్నారు. పార్టీ పరంగా ప్రతి సచివాలయానికి ముగ్గురు కన్వీనర్లు, క్లస్టర్ పరిధిలో ఇద్దరు రథ సారథులను నియమించారని, వీరంతా పార్టీ శ్రేణులను కలుపుకుని సంక్షేమ పథకాలను ప్రజల్లోకి పూర్తిస్థాయిలో తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. పదవులు బాధ్యతలు పెంచుతాయని, బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించినప్పుడే ప్రజల్లో మంచి గుర్తింపు లభిస్తుందని వివరించారు. గతంలో తాను ఎమ్మెల్యేగా ఉండగా పేదల సొంతింటి కలను నిజం చేసేందుకు 82 ఎకరాల భూమిని సేకరించగా, నేడు సీఎం జగన్ నేతృత్వంలో వందలాది ఎకరాలు సేకరించి నియోజకవర్గంలో పేదలకు ఇళ్ల స్థలలాలు పంపిణీ చేసినట్టు చెప్పారు. పార్టీ నియోజకవర్గ పరిశీలకుడు, ఏపీఆర్‌డీసీ చైర్మన్ కనుమూరు సుబ్బరాజు (రాజబాబు) మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ భారీ మెజార్టీతో గెలిపించి పార్టీని తిరిగి అధికారంలోని తీసుకొచ్చేందు సైనికుల్లా పని చేయాలని కోరారు. డీసీఎంఎస్ చైర్మన్ వేండ్ర వెంకటస్వామి మాట్లాడుతూ అన్ని వర్గాలకు సమన్యాయం చేస్తున్న సీఎం జగన్, ఎమ్మెల్యే శ్రీనివాస్‌లకు పార్టీ శ్రేణులు, ప్రజలు అండగా నిలవాలన్నారు. సమావేశంలో ఎంపీపీ పేరిచర్ల విజయ నర్సింహరాజు, ఏఎంసీ మాజీ చైర్మన్ తిరుమాని ఏడుకొండలు, వైఎస్సార్‌సీపీ నరసాపురం పార్లమెంట్ కన్వీనర్ గూడూరి ఉమాబాల, రాష్ట్ర గౌడ కార్పొరేషన్ డైరెక్టర్ కామన నాగేశ్వరరావు, రాష్ట్ర రజక కార్పొరేషన్ డైరెక్టర్ రేవూరి గోగిరాజు, పార్టీ నాయకులు మేడిది జాన్సన్, ఏఎస్ రాజు, పోట్టి సత్యనారాయణ (దాసు), గొలగాని సత్యనారాయణ, కోడె యుగంధర్, తోట భోగయ్య, పెనుమాల నర్సింహస్వామి, యరకరాజు సుబ్రహ్మణ్యంరాజు (చినబాబు) తదితరులు పాల్గొన్నారు.

జూదరుల అరెస్ట్

సాక్షి, భీమవరం: స్థానిక వన్‌టౌన్ పోలీసుస్టేషన్ పరిధిలో పేకాడుతున్న ముగ్గుర్ని అరెస్టు చేసి, రూ.1,500 స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై ఎం.వెంకటేశ్వరావు శనివారం చెప్పారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామన్నారు. పొలంలోనికి పశువులు రాడడంతో డిసెంబర్ 30న ఇద్దరు వ్యక్తులు ఘర్షణపడి ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

ఫొటో గ్రాఫర్‌పై దాడి

భీమవరం అర్బన్: శుక్రవారం అర్ధరాత్రి ఫొటోగ్రాఫర్‌పై కొందరు చేసిన దాడిపై పోలీసులు కేసు నమోదు చేశారు. గూట్లపాడు గ్రామంలో చర్చి వద్ద అదే గ్రామానికి చెందిన ఫొటో గ్రాఫర్ మద్దా పిలీఫ్‌బాబు ఈనెల 29 తన బాబాయి కుమారుని వివాహం కార్యక్రమ ఫొటోస్ తీస్తుండగా గొడవ జరిగింది. ఈ నేపథ్యంలో పిల్లి చార్లెస్, పిల్లి అజయ్, కర్రా బెన్నీ, సన్ని, నేతల బాలు, నేతల నిరంజన్, పిల్లి విజయ్‌లు తనను అన్యాయంగా కొట్టి గాయపరిచారని మద్దా పిలీఫ్‌బాబు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పాలకొల్లులో పురోహితుల ర్యాలీ

పాలకొల్లు సెంట్రల్: తెలంగాణ రాష్ట్రం వికారాబాద్ జిల్లాలో అయ్యప్పస్వామిపై చేసిన అనుచిత వ్యాఖ్యలపై పాలకొల్లు పట్టణంలో గాయత్రి స్మార్త పురోహిత సంఘం ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ నిర్వహించారు.

అంగన్‌వాడీ పోస్టుల భర్తీకి నోటిపికేషన్

పెనుమంట్ర: పెనుమంట్ర ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని పెనుమంట్ర, పెనుగొండ మండలాలకు చెందిన ఖాళీగా ఉన్న 9 అంగన్‌వాడీ పోస్టుల భర్తీకోసం నోటిఫికేషన్ విడుదల చేసినట్లు పెనుమంట్ర ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారిణి కె మేరీఎలిజబెత్ శనివారం తెలిపారు. ఈ పోస్టులకు జనవరి 5వ తేదీ లోపు 10వ తరగతి ఉత్తీర్ణత కలిగిన మహిళలు దరఖాస్తు చేసుకోవచ్చని ఆమె తెలిపారు. అంగన్‌వాడీ కార్యకర్త వెలగలేరు (ఎస్సీ), మినీ అంగన్‌వాడీ కార్యకర్త వెలగలవారిపాలెం (తాళ్లచెరువు) ఎస్సీ, సిద్దాంతం (ఓసీ), అంగన్‌వాడీ సహాయకులు నెగ్గిపూడి, వడలి, పెనుమంట్ర, రామన్నపాలెం (ఓసీ) కేటగిరికి, పాలమూరు, మల్లపదిబ్బ (ఎస్సీ)లకు రిజర్వ్ చేసినట్లు ఆమె తెలిపారు.





























క్లుప్తంగా

క్రైస్తవ మిషనరీల సేవలు విస్తృతం



నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించిన ప్రసాదరాజు

నరసాపురం: కొత్త సంవత్సరంలో క్రైస్తవ మిషనరీల ద్వారా సేవా కార్యక్రమాలు మరింత విస్తృతంగా నిర్వహించాలని ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు కోరారు. ది కేర్ మినిస్ట్రీస్‌కు చెందిన ఆత్మదీపం సంస్థ రూపొందించిన 2023 క్యాలెండర్‌ను ప్రసాదరాజు శనివారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ప్రారంభించారు. 30 ఏళ్ల క్రితం స్థాపించిన దికేర్ స్వచ్ఛంద సేవాసంస్థ బైబిల్ ప్రవచనాలతో పాటు, పేదలకు ఉపయోగపడేలా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తోందన్నారు. దికేర్, ఆత్మదీపం సంస్థ వ్యవస్థాపకుడు, ప్రముఖ న్యాయవాది చదలవాడ జ్ఞానప్రకాష్‌ను అభినందించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బర్రి శ్రీవెంకటరమణ, కౌన్సిలర్లు యర్రా శ్రీను, గొల్ల జయరాజ్‌సింగ్, సిర్రా కాంతమ్మ, జిల్లెళ్ల దిలీప్, పతివాడ మార్కెండేయులు, వైఎస్సార్‌సీపీ పట్టణ చూత్ అధ్యక్షుడు సీహెచ్ మెర్లిన్ పాల్గొన్నారు.

ఎనిమిది మంది మృతిపై నోరు మెదపని పవన్



సమావేశంలో మాట్లాడుతున్న యడ్ల తాతాజీ

పాలకొల్లు సెంట్రల్: ఇప్పటంలో రోడ్డు వెడల్పు కోసం గోడలు తొలగిస్తే రాద్ధాంతం చేసిన పవన్ కల్యాణ్ నాలుగు రోజులు క్రితం చంద్రబాబు సభలో ఎనిమిది మంది మృతి చెందితే ఇంతవరకూ ఎందుకు నోరెత్తలేదని డీసీఎంఎస్ మాజీ చైర్మన్ యడ్ల తాతాజీ ప్రశ్నించారు. శనివారం తన కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడుతూ పబ్లిసిటీ కోసం తాపత్రయం పడడం వల్లే ఇరుకు రోడ్డులో సభ నిర్వహించడం వల్ల ఈ ప్రమాదం జరిగిందన్నారు. గతంలో గోదావరి పుష్కరాల్లోనూ చంద్రబాబు పబ్లిసిటీ తాపత్రయం వల్లే పలువురు మృతి చెందారని అన్నారు. ప్రజల ప్రాణాలకన్నా చంద్రబాబును ముఖ్యమంత్రిని చేయాలన్న తపనే పవన్‌లో ఎక్కువగా కనిపిస్తోందన్నారు. రాష్ట్రంలో ఎక్కడైనా ఎవరైనా ప్రమదవశాత్తు చనిపోతే కోటి రూపాయలు నష్ట పరిహారం ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేసే చంద్రబాబు నేడు బాధితులకు రూ. 10 లక్షల ఇచ్చి చేతులు దులుపుకోవడం ఏమిటంటూ ప్రశ్నించారు. చంద్రబాబు నిర్లక్ష్యం వల్లే ఎనిమిది మంది చనిపోయారని దీనికి పూర్తి బాధ్యత ఆయన వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ పార్టీ నాయకులు గంటా నరేష్, పెచ్చెట్టి కృష్ణాజీ, బెజ్జవరపు నాగరాజు, కొరగింజల హనుమంతు, పిల్లా శ్రీను, రేలంగి శ్రీనివాసు, పిల్లా అప్పాజీ, తలుపూరి బుజ్జి, త్సవటపల్లి కృష్ణమోహన్ పాల్గొన్నారు.

వరాల వెంకన్న ఆలయానికి పోటెత్తిన భక్తులు

అత్తిలి: ఈడూరు గ్రామంలో వేంచేసియున్న శ్రీవరాల వెంకటేశ్వరస్వామి వారికి శనివారం విశేష పూజలు జరిపారు. వేకువ జామున సుప్రభాత సేవ, తోమాలసేవ, ఉదయం అర్చనలు నిర్వహించి విశేషంగా అలంకరించారు. ఆలయ అర్చకులు వాడపల్లి శేఖరాచార్యులు ఆధ్వర్యంలో ప్రత్యేకంగా పూజలు నిర్వహించారు. పరిసర ప్రాంతాల నుంచి వందలాది మంది భక్తులు కాలినడకన స్వామివారి ఆలయానికి చేరుకుని, దర్శించుకున్నారు. హాజరైన భక్తులకు దాత సహకారంతో అన్నదానం చేసారు.

ల్యాండ్ సర్వేయింగ్ కోర్సు ప్రారంభం

పెంటపాడు: పెంటపాడు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో రాష్ట్ర సాంకేతిక విద్యామండలి ఆదేశాల ప్రకారం ల్యాండ్ సర్వేయింగ్ సర్టిఫికెట్ల కోర్సు ప్రారంభించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డి. ఫణీంద్రప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. పదోతరగతి పాసైన అర్హులైన , ఆసక్తి కలిగిన విద్యార్థులు ఈ కోర్సులో చేరవచ్చన్నారు. ఈ కోర్సులో చేరగోరే విద్యార్థులు నేరుగా పెంటపాడు పాలిటెక్నిక్ కళాశాలలో సంప్రదించాలన్నారు. వివరాలకు ఫోన్: 85006 51633లను సంప్రదించాలన్నారు.

ఘనంగా యూత్ క్రిస్మస్ వేడుకలు

ఉండి: క్రిస్మస్ వేడుకల్లో భాగంగా చివరి రోజు డిసెంబర్ 31వ తేదీన ఉండి మండలం ఎన్నార్పీ అగ్రహారం ట్రినిటీ లూథరన్ చర్చి ఆధ్వర్యంలో యూత్ క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. శనివారం తెల్లవారు జాము నుంచి ప్రారంభమైన ఈ వేడుకల్లో వందలాది మంది యూత్, సంఘ సభ్యులు పాల్గొన్నారు. క్రీస్తు పుట్టుకపై పాటలు పాడుతూ క్రీస్తునేడు పుట్టెను అంటూ నినాదాలు చేశారు. స్థానిక అసిస్టెంట్ పేరిష్ పాస్టర్ రెవరెండ్ డేవిడ్ లివింగ్‌స్టన్, సంఘ సీఆర్ డి.సునీల్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన కేరల్స్ కార్యక్రమం ఆసక్తికరంగా సాగింది. పెద్ద ఎత్తున బాణసంచా కల్చులు, ఆర్కెస్ట్రా వాయిద్యాల నడుమ క్రీస్తు పుట్టక గీతాలను విశ్వాసులు ఆలపించారు. ఈ సందర్భంగా పాస్టర్ డేవిడ్ లివింగ్‌స్టన్ క్రీస్తు పుట్టకను వివరించారు. యేసుక్రీస్తుని జననం పాప జీవిత వినాశనమని పేర్కొన్నారు. పాపం వల్ల కలిగే ప్రతిఫలం నరకమని, ఆ నరక బాధలు తప్పించేందుకే యేసు క్రీస్తు మనిషిగా పుట్టారని, మనుషుల్లో మార్పు తెచ్చారని వివరించారు. క్రీస్తు బోధనలయిన ఆదర్శనీయమని అన్నారు. కార్యక్రమంలో చర్చ్ యూత్ ప్రతినిధులు, సంఘ పెద్దలు, సంఘ సభ్యులు, స్త్రీల సమాజం, సండె స్కూల్ విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

శాంతి మార్గాన్ని ఆచరించాలి

కాళ్ల: క్రీస్తు శాంతి మార్గాన్ని ప్రతి ఒక్కరూ ఆచరించాలని కోపల్లె ప్యారిస్ పాస్టర్లు పేర్కొన్నారు. కోపల్లె గ్రామంలో డీఎస్ రాజు ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి గ్రాండ్ క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. పలువురు పాస్టర్లు మాట్లాడుతూ ఏసు క్రీస్తు జన్మదినం సందర్భంగా మానవాళి అనుసరించాల్సిన అంశాలను బోధించారు. క్రైస్తవ గీతాలను ఆలపించి క్రిస్మస్ కేక్‌ను కట్ చేసి ప్రేమ విందు ఏర్పాటు చేశారు. ముఖ్యఅతిథులుగా పలువురు ప్యారిస్ పాస్టర్లు హాజరై క్రీస్తు సందేశాన్ని వివరించారు. కార్యక్రమంలో పాస్టర్లు గోడి దైవప్రసాద్, డి.లాజరస్, ఎంవీ ప్రసాద్, మురాల జోషి, జాన్ రత్నం తదితరులు పాల్గొన్నారు.

పురుషుల క్రిస్మస్

ఆకివీడు: సమాజానికి నీతిమంతుడిగా యేసు దేవదూతగా జన్మించాడని సీబీసీఎంసీ సంఘాల అసోసియేషన్ కార్యదర్శి జోసఫ్ రాజు అన్నారు. స్థానిక పెదపేటలోని సీబీసీఎంసీ సెంటినరీ చర్చి ఆవరణలో పురుషుల క్రిస్మస్ శనివారం ఘనంగా నిర్వహించారు. దేవుని మాటలు ఆచరించడం ద్వారా సన్మార్గం వైపు పయనించవచ్చని రాజు సూచించారు. ఈ సందర్భంగా సీనియర్ సిటిజన్ సిగురుపాటి శామ్యూల్ రాజు, బి.యేసు రాజులను సత్కరించారు.

స్తుతి ఆరాధన

సాక్షి, భీమవరం: క్రిస్మస్ సందర్భంగా స్థానిక తాడేరు రోడ్డులోని పరిశుద్ధ క్రీస్తు ఆలయంలో శనివారం క్రిస్మస్ స్తుతి ఆరాధన నిర్వహించారు. క్రీస్తు ఆలయ ట్రస్ట్ అధ్యక్షుడు ఆర్ ప్రసాదరాజు, ఇమ్మానుయేల్ ట్రస్ట్ అధినేత బి.ఎర్నస్ట్‌పాల్ క్రీస్తు సందేశం వివరించారు. ఈ సందర్భంగా వృద్ధులకు దుప్పట్లు, సండే స్కూల్ పిల్లలకు బైబిల్స్, నోట్ పుస్తకాలు, వాటర్ బాటిల్స్ వంటివి పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆర్ భారతి, ఎస్ జీవన్‌బాబు, భాగ్యం, అనిత, మేరి బాయి, జ్యోతి, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

కొత్త సంవత్సర సందడి

ఆకివీడు/భీమవరం(ప్రకాశం చౌక్): 2022కు వీడ్కోలు పలుకుతూ 2023 కొత్త సంవత్సరానికి అన్నివర్గాల ప్రజలు స్వాగతం పలికారు. శనివారం అర్ధరాత్రి దాటిన తర్వాత యువత నూతన సంవత్సర శుభాకాంక్షలు అంటూ నినాదాలు చేశారు. శనివారం సాయంత్రం భీమవరం, ఆకివీడు పట్టణాల్లో బ్యాకరీలు, పండ్లు, పూల దుకాణాలు కిటకిటలాడాయి.



ఎన్నార్పీ అగ్రహారంలో నిర్వహిస్తున్న క్రిస్మస్ కేరల్స్



ట్రినిటీ లూథరన్ చర్చిలో కేక్ కట్ చేస్తున్న దృశ్యం



కోపల్లెలో క్రిస్మస్ కేకు కట్ చేస్తున్న దృశ్యం



ఆకివీడు పెదపేటలో శామ్యూల్ రాజుకు సన్మానం



భీమవరంలో దుప్పట్లు, బైబిల్స్ పంపిణీ



ఆకివీడులో పువ్వులు కొనుగోలు చేస్తున్న దృశ్యం



ఆకివీడులో కేకులు కొనుగోలు చేస్తున్న దృశ్యం



భీమవరంలో యువకుల సందడి

తాగునీటి కోసం ప్రత్యేక నిధులు

- ప్రతి మండలానికి 300 నుంచి 500 మందికి కొత్త పెన్షన్లు
- కొత్త ఏడాది నుంచి రూ.250 పెంచి పెన్షన్ పంపిణీ
- జెడ్పీ సర్వసభ్య సమావేశంలో చైర్మన్ కవురు శ్రీనివాస్



సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ కవురు శ్రీనివాస్

ఏలూరు (మెట్రో): జిల్లాలో తాగునీటికి సమస్య నివారణకు సత్వర చర్యలు తీసుకుంటున్నామని జిల్లా ప్రజా పరిషత్ చైర్మన్ కవురు శ్రీనివాస్ చెప్పారు. స్థానిక జిల్లా పరిషత్ మీటింగ్ హాలులో శనివారం జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం జెడ్పీ చైర్మన్ కవురు శ్రీనివాస్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా కవురు శ్రీనివాస్ మాట్లాడుతూ ఏ ప్రాంతంలోనైనా తాగునీటి సమస్య గుర్తించి తన దృష్టికి తీసుకువస్తే, సమస్య పరిష్కారానికి ప్రత్యేకంగా నిధులు మంజూరు చేస్తానన్నారు. మండల ప్రజాప్రతినిధులు తమ పరిధిలో చేపట్టవలసిన అభివృద్ధి కార్యక్రమాలను తనకు తెలియజేస్తే వెంటనే పనులు మంజూరు చేస్తానన్నారు. రాష్ట్రంలో విద్యాభివృద్ధికి ప్రభుత్వం చేపట్టిన పనులు దేశంలోని వివిధ రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచాయని, తెలంగాణకు చెందిన అధికారులు, ప్రజాప్రనిధుల బృందం జిల్లాలో మనబడి నాడు–నేడు, అమ్మఒడి, జగనన్న గోరుముద్ద వంటి కార్యక్రమాల అమలు పరిశీలించి, వారి రాష్ట్రంలో కూడా అమలు చేస్తామని తెలియజేశారన్నారు. జల్ జీవన్ మిషన్ ద్వారా జిల్లాలోని ప్రతి ఇంటికి తాగునీటి సదుపాయం కల్పిస్తామన్నారు. జెడ్పీటీసీ తెలిపిన సమస్యకు స్పందిస్తూ మండల స్థాయిలో జరిగే అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు, అభివృద్ధి పనుల సమాచారాన్ని స్థానిక ఎంపీపీ, జెడ్పీటీసీ, సర్పంచ్‌లకు తప్పనిసరిగా తెలియజేయాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో పెంచిన పెన్షన్లను జనవరి 1వ తేదీ నుంచి పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీ మేరకు వరసగా మూడో సంవత్సరం రూ.250 పెంచి రూ.2,750లను 2023 జనవరి 1వ తేదీ నుంచి లబ్ధిదారుల ఇంటింటికీ వెళ్లి అందించడం జరుగుతుందన్నారు. జిల్లాలో అర్హులైన ఏ ఒక్కరికీ పెన్షన్ తొలగించేది లేదని, అర్హులైన ప్రతి ఒక్కరికీ పెన్షన్ అందిస్తామన్నారు. జిల్లాలో ప్రతి మండలంలో 300 నుంచి 500 మంది వరకు కొత్తగా పెన్షన్లు మంజూరు చేయడం జరిగిందన్నారు. ప్రతి ఆరు నెలలకోసారి పెన్షన్ లబ్ధిదారుల సర్వే జరుగుతుందని, సర్వేలో ప్రభుత్వ నిబంధనల ననుసరించి ప్రభుత్వ ఉద్యోగం పొందిన, ఫోర్ వీలర్ కలిగినా, వెయ్యి చదరపు గజాల ఇళ్ల స్థలం కలిగి ఉన్నా, 300 యూనిట్లకు మించి విద్యుత్ వినియోగం కలిగినా, ఆదాయపు పన్ను పరిధిలోనికి వచ్చినా తదితర కారణాలు కలిగిన వారికి నోటీసులు ఇవ్వడం జరుగుతుందని, వారి నుండి సహేతుకమైన వివరణ అందించిన వారి దరఖాస్తులను పరిశీలించి అర్హత కలిగి ఉంటే పెన్షన్‌ను కొనసాగిస్తామన్నారు. నోటీసు ఇచ్చినంత మాత్రాన పెన్షన్ తొలగించినట్లు కాదని, జిల్లాలో ప్రస్తుతం 5 వేల మందికి పైగా నోటీసులు ఇవ్వగా, వారిలో కేవలం 1400 మందిని మాత్రమే అనర్హులుగా గుర్తించడం జరిగిందన్నారు. గత ప్రభుత్వం 20 ఎకరాలు ఉన్న వారికి సైతం పెన్షన్లు అందించి అవకతవకలకు పాల్పడ్డారని, ప్రస్తుత ప్రభుత్వం అర్హులైన ప్రతి ఒక్కరికీ పెన్షన్ అందించడమే లక్ష్యంగా పనిచేస్తోందన్నారు. 2022–23 ఆర్థిక సంవత్సరానికి జిల్లా పరిషత్ బడ్జెట్ రూ.139.31 కోట్లుగా సవరించామని, వ్యయం రూ.135.91 కోట్ల రూపాయలు కాగా, క్లోజింగ్ బ్యాలెన్స్ రూ.3.45 కోట్లు అన్నారు. 2023–24 ఆర్థిక సంవత్సరానికి మొత్తం బడ్జెట్ అంచనా రూ.48.45 కోట్లు కాగా, వ్యయం రూ.47.04 కోట్లు చెప్పారు. అనంతరం సమావేశంలో విద్య, సాంఘిక సంక్షేమం, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ, వ్యవసాయం, ధాన్యం కొనుగోలు, సాంఘిక సంక్షేమం, తదితర శాఖల కార్యక్రమాలను సమీక్షించారు. సమావేశంలో జిల్లా పరిషత్ సీఈఓ కె.రవికుమార్, ఇరిగేషన్ ఎస్ఈ శ్రీనివాసరావు, డీఆర్‌డీఏ పీడీ విజయరాజు, వ్యవసాయ శాఖ జేడీ వై.రామకృష్ణ, గృహ నిర్మాణ శాఖ పీడీ వేణుగోపాల్, విద్యా శాఖ జేడీ మధుసూదనరావు, జెడ్పీటీసీలు, ఎంపీపీలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

అసోసియేషన్ల మధ్య రుసుములపై వాగ్వివాదం

పాలకొల్లు సెంట్రల్: పట్టణంలో ది పాలకొల్లు కోకోనట్ మర్చంట్స్ అసోసియేషన్, నరసాపురం, పోడూరు తాలూక లారీ ఓనర్స్ అసోసియేషన్ల మధ్య లారీల్లో సరుకు దిగుమతి, ఎగుమతుల్లో ఇచ్చే రుసుములపై వివాదం చిలికి చిలికి గాలివానగా మారింది. దీనిపై శనివారం కోకోనట్ మర్చంట్స్ అసోసియేషన్ సభ్యులు తమ సంఘ భవనంలో సమావేశమై అనంతరం నిరశన ర్యాలీగా పోలీస్‌స్టేషన్‌కు వెళ్లారు. ఈ సందర్భంగా కోకోనట్ అసోసియేషన్ సభ్యులు మాట్లాడుతూ కొబ్బరికాయలు ఎగుమతులు చేసిన తరువాత లారీకి పగ్గం కట్టిన కార్మికులకు మామూళ్లు ఇవ్వడం లేదని అన్నారు. ఇదేమిటని ప్రశ్నించినందుకు కొబ్బరికాయలు లోడు చేసేందుకు పట్టణ లారీ అసోసియేషన్ సభ్యులు వాహనాలు ఏర్పాటు చేయడం లేదని వాపోయారు. బయట నుంచి లారీలు తెచ్చుకుని ఎగుమతులు చేసుకుంటే వాటిని అడ్డగిస్తున్నారని అన్నారు. దీనివల్ల రైతులు, దింపు, వలుపు, దిగుమతి, ఎగుమతి కార్మికులు జీవనోపాధికి ఇబ్బందులు కలుగుతున్నాయన్నారు. వారం రోజులుగా దిగుమతి, ఎగుమతులు లేకపోవడం వల్ల కార్మికులు అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. రాష్ట్రంలోనే కాకుండా పక్కనే ఉన్న భీమవరంలో లారీ ఓనర్లు కార్మికులకు రుసుములు ఇస్తున్నారని తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాల్లో పాలకొల్లు, అమలాపురంలో మాత్రమే లారీ అసోసియేషన్ సభ్యులు కొబ్బరి కార్మికులను ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. నెల రోజులు క్రితమే కోకోనట్ మర్చంట్స్ అసోసియేషన్ సభ్యులకు రుసుముల వ్యవహారంపై నోటీసు ఇచ్చినా వారి నుంచి సమాధానం రాకపోవడంతో లారీలు నిలుపుదల చేశామని లారీ అసోసియేషన్ సభ్యులు అన్నారు. ఎగుమతి, దిగుమతుల్లో కార్మికులకు, గుమస్తాలకు ఇచ్చే రుసుములను తమ కిరాయిల్లో కలిపి రాయవద్దని కోరుతున్నామన్నారు.

పోలీసుల జోక్యం

ఈ వివాదంపై పట్టణ సీఐ అఖిల్ జామా కలుగజేసుకుని కోకోనట్ వర్తకులు, లారీ అసోసియేషన్ సభ్యులతో చర్చించారు. ఇరువురి అసోసియేషన్ సభ్యుల ప్రధాన సంఘాల నాయకులు అందుబాటులో వచ్చిన తరువాత చర్చించి సమస్యను సామరస్యంగా పరిష్కరించుకోవాలని సూచించారు. లారీ స్టాండ్‌లో ఆపిన లారీని వదిలేయాలని, చట్ట ప్రకారం ఇది నేరమని సీఐ లారీ అసోసియేషన్ సభ్యులను హెచ్చరించారు. దీంతో ఆపిన లారీని విడుదల చేశారు. రూరల్ సీఐ కె.శ్రీనివాసకుమార్, ఎస్సై ఎస్ ముత్యాలరావు, కె.శ్రీనివాసరావు, కోకోనట్స్ అసోసియేషన్ సభ్యులు బుద్దా లక్ష్మీనారాయణ, కోట శేషబాబు, కఠారి నాగేంద్రకుమార్, కుందారు వెంకట్రామయ్య, దేవరపు లక్ష్మీనారాయణ, మాటూరి నరసింహరావు, లారీ అసోసియేషన్ సభ్యులు దుగ్గిన రామశివరావు, యడ్ల సత్యనారాయణ, పి సత్యనారాయణ, బి కృష్ణ, సిహెచ్ సత్యనారాయణ, ఎం అజయ్‌బాబు, సత్యనారాయణ చర్చల్లో పాల్గొన్నారు.

కన్వీనర్లు, వలంటీర్లు సమన్వయంతో పనిచేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న చీఫ్ విప్ ప్రసాదరాజు

మొగల్తూరు: కన్వీనర్లు, వలంటీర్లు సమన్వయంతో పనిచేసి ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలని చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు సూచించారు. శనివారం మొగల్తూరులోని ఆర్యవైశ్య కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వలంటీర్లు, కన్వీనర్లు ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను వివరిస్తూ అర్హులకు అందేలా చూడాలన్నారు. సచివాలయం, వలంటీర్ వ్యవస్థలను ఇతర రాష్ట్రాలు అమలు చేసేందుకు ఆసక్తి చూపిస్తున్నాయన్నారు. సంక్షేమ పథకాల సక్రమ అమలుకు ప్రభుత్వం కన్వీనర్లను నియమించిందని తెలిపారు. పథకాలను లబ్ధిదారులకు అందించడంలో వలంటీర్లతో పాటు కన్వీనర్లు సహకారం అందిస్తారన్నారు. ఈసమావేశంలో నాయకులు మోటుపల్లి రాంభాష్కరరావు, పడవల సత్యనారాయణ, బాలం నాగమల్లేశ్వరరావు, బోణం నర్సింహరావు, గుబ్బల నారాయణమూర్తి, కుక్కల కృష్ణ మోహన్, కొల్లాటి వెంకటేశ్వరరావు, పెంకే చంటి, మోకా నాగశంకరం, దూసనపూడి దొరబాబు పాల్గొన్నారు.

విద్యావ్యవస్థలో విప్లవాత్మక మార్పులు



ఎస్ ఇల్లిందలపర్రు పాఠశాలలో ట్యాబ్‌లు పంపిణీ చేస్తున్న ఎంపీపీ, సర్పంచ్

పెనుమంట్ర: విద్యావ్యవస్థలో డిజిటల్ టెక్నాలజీ తీసుకువచ్చిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని పెనుమంట్ర ఎంపీపీ కర్రి వెంకట నారాయణరెడ్డి అన్నారు. శనివారం ఎస్ ఇల్లిందలపర్రులో ప్రాథమిక ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ట్యాబ్‌లను పంపిణీ చేసారు. ఈకార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న వెంకటనారాయణరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో పేదవిద్యార్థి ఉన్నత శిఖరాలకు వెళ్లాలనే ఉద్దేశ్యంతో విద్యావ్యవస్థలో అనేకమార్పులు తీసుకువస్తున్నారని, ఈఅవకాశాన్ని విద్యార్థులు, తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా పాఠశాలలో 23 మంది విద్యార్థులకు ట్యాబ్‌లను పంపిణీ చేసారు. ఈకార్యక్రమంలో సర్పంచ్ వనుం సూర్యనారాయణ, ఉపసర్పంచ్ గొలుగూరి నాగిరెడ్డి, వైఎస్సార్‌సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు కొవ్వూరి భాస్కరరెడ్డి, కొవ్వూరి వెంకటేశ్వరరెడ్డి, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

భార్యాబిడ్డల అదృశ్యంపై కేసు నమోదు

తాడేపల్లిగూడెం రూరల్: తన భార్య, బిడ్డలు కనిపించడం లేదంటూ అందిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్టు రూరల్ ఏఎస్సై బులిస్వామి చెప్పారు. శనివారం ఆయన తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. నవాబుపాలెంలో గండ్రోతు కాశీవిశ్వనాథం, శాంతకుమారి భార్యాభర్తలు. వీరికి ఐదు, నాలుగేళ్ల గండ్రోతు విక్రమాదిత్య, నిత్య తులసి ఉన్నారు. కాశీవిశ్వనాథం ఇనుప వ్యాపారం చేస్తుంటాడు. ఈ క్రమంలో కాశీవిశ్వనాథం వ్యాపారం నిమిత్తం ఒంగోలు వెళ్లాడు. శనివారం తెల్లవారుజామున 4.30 గంటల నుంచి శాంతకుమారి, ఇద్దరు బిడ్డలు కనిపించడం లేదని ఫోన్ ద్వారా కాశీవిశ్వనాథంకు సమాచారం అందించింది. బంధువులు, స్నేహితుల ఇళ్లల్లో గాలించినా ఆచూకీ కానరాకపోవడంతో శనివారం రూరల్ పోలీసులను ఆశ్రయించారు. కాశీవిశ్వనాథం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్టు రూరల్ ఏఎస్సై తెలిపారు.

అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు



శేరేపాలెంలో లబ్ధిదారులకు బ్రోచర్‌ను అందిస్తున్న చీఫ్‌విప్ ప్రసాదరాజు

మొగల్తూరు: మండలంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో తన దృష్టికి వచ్చిన సమస్యలను పరిష్కరించానని, అర్హులందరికీ పథకాలు అందేలా చర్యలు తీసుకున్నామని చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు తెలిపారు. మండలంలోని శేరేపాలెంలో రెండో రోజు గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో భాగంగా రాత్రి పల్లె నిద్ర చేసిన ఆయన శనివారం వేకువ జామునే గ్రామంలో పర్యటిస్తూ స్థానికులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ పథకాలపై ప్రచురించిన బ్రోచర్‌ను లబ్ధిదారులకు అందించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం మొగల్తూరు మండలంలో పూర్తయ్యిందన్నారు. ఈ సందర్భంగా తన దృష్టికి వచ్చిన సమస్యలను పరిష్కరించేందుకు రూ 4 కోట్లు కేటాయించినట్టు తెలిపారు. నియోజకవర్గంలో సమస్యల పరిష్కారానికి రూ.14 కోట్లు కేటాయించామన్నారు. తాగు నీటి సమస్యను పరిష్కరించేందుకు కాళీపటన్నం, కేపీపాలెంలోని భారీ మంచి నీటి ప్రాజెక్టులకు రూ.కోటితో మైక్రో ఫిల్టర్లు ఏర్పాటుకు నిదులు మంజూరు చేశామన్నారు. జలజీవన్ మిషన్ ద్వారా కోట్లాది రూపాయలు వెచ్చించి పైప్‌లైన్లు, ఓహెచ్ఆర్‌లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. శేరేపాలెంలో మరో ఓహెచ్ఆర్‌ను ఏర్పాటు చేసి నేరుగా మొగల్తూరు నుంచి ఈ గ్రామానికి తాగు నీరందించేలా ప్రతిపాదనలు సిద్ధం చేశామన్నారు. మండలంలోని ప్రతి గ్రామంలో శ్మశాన వాటికల అభివృద్ధికి రూ.14 కోట్ల నిధులు మంజూరు చేశామన్నారు. గ్రామంలోని 951 కుటుంబాలకు సుమారు రూ.13.62 కోట్లు పథకాల రూపంలో అందించామన్నారు. ఈకార్యక్రమంలో శేరేపాలెం, కొత్తపాలెం సర్పంచ్‌లు తణుకుల మునేశ్వరరావు, లోకం వెంకటలక్ష్మి నాని, నాయకులు రంగిశెట్టి ఏసు, కొత్తపల్లి బాబి, తన్నీడి గిరి,వేగి బాబి, గూడూరి మావుళ్ళు, ఆకుల పెద్దిరాజు, కొత్తపల్లి బాబులు, కొత్తపల్లి చిన్న, గూడూరి గంగాజలం, కొల్లాబత్తుల రవికుమార్, పోతుల రమేష్, కోడెళ్ళి వెంకట్రావు, డీవీవీ సత్యనారాయణ, కొత్తపల్లి నాగరాజు, కడలి ఏసు,దూసనపూడి రామాంజనేయులు, కత్తుల నాగేశ్వరరావు, కత్తుల శ్రీరంగం పాల్గొన్నారు.

క్లుప్తంగా

కొత్త ఏడాదిలో పించన్ల పండుగ



మాట్లాడుతున్న పీవీఎల్

కాళ్ల: ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం పేదల పించన్ సొమ్ము పెంచి ఇవ్వడం వల్ల కొత్త సంవత్సరంలో ప్రతి ఇంట పండగ వాతావరణం నెలకొంటుందని డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నరసింహరాజు తెలిపారు. కాళ్ల మండలం పెదఅమిరం పార్టీ కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కొత్త ఏడాది మొదటి రోజు పింఛన్లు పెంచి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి లబ్ధిదారులకు కానుకగా ఇస్తున్నట్లు చెప్పారు. ప్రతి గ్రామంలోనూ ఉదయం నుంచి వలంటీర్లు నూతన కన్వీనర్లతో కలిపి పింఛన్లు అందించనున్నట్లు వివరించారు. నియోజకవర్గ ప్రజలకు, అధికారులకు, నాయకులకు, కార్యకర్తలు, అభిమానులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

మోగల్లులో ఫీవర్ సర్వే



మోగల్లులో ఫీవర్ సర్వే చేస్తున్న దృశ్యం

పాలకోడేరు: పాలకోడేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ సీహెచ్‌వీ రంగమ నాయుడు ఆధ్వర్యంలో మోగల్లులో శనివారం ఫీవర్ సర్వే చేపట్టారు. అరుంధతీపేట, ఎస్సీ ఏరియాల్లో ప్రజలతో మాట్లాడారు. కాచి చల్లార్చిన నీరు తాగాలని, దోమల ఉధృతి తగ్గించడానికి డ్రెయినేజీల్లో నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని, కరోనా పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సీహెచ్‌ఓ సత్యనారాయణ, హెల్త్ విజిటర్ అమ్మాజి, హెచ్ఎస్ అయ్యప్ప శ్రీనివాస్, ఎంఎల్‌హెచ్‌పీలు పి.ఇందిర, ఎం.దివ్య సునంద, ఏఎన్ఎంలు ధన లక్ష్మి, జయశ్రీ, మరియమ్మ, ఉషా సుందరి, ఉషారాణి, హెల్త్ అసిస్టెంట్లు సుధాకర్, ఖాన్, సీహెచ్ రవి, ఆశలు కేదాశి చంటమ్మ, నీలమ, తులసి, మరియమ్మ, వీరమ్మ తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారికి బంగారం సమర్పణ



అమ్మవారికి బంగారం సమర్పిస్తున్న శ్రీనివాస్, కామేశ్వరి దంపతులు

భీమవరం(ప్రకాశం చౌక్): మావుళ్లమ్మవారికి శనివారం భీమవరానికి చెందిన జి.శ్రీనివాస్ కామేశ్వరి దంపతులు 10 గ్రాముల బంగారం సమర్పించారు. దాతలను ఆలయ చైర్మన్ మానేపల్లి నాగేశ్వరావు సత్కరించి అమ్మవారి ప్రసాదం అందించారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు, అర్చకులు పాల్గొన్నారు.


వపా బాపు ఆర్ట్ అకాడమీ అధ్యక్షుడు కొసనాకు సత్కారం



మంత్రి ధర్మాన చేతుల మీదుగా పురస్కారం అందుకుంటున్న కొసనా భాస్కరరావు

పాలకొల్లు సెంట్రల్: సుమిత్రా కళా సమితి, వడ్డాది పాపయ్య శత జయంతి వేడుకలు శుక్రవారం శ్రీకాకుళంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాలకొల్లు వపా బాపు ఆర్ట్ అకాడమీ అధ్యక్షుడు కొసనా భాస్కరరావు మంత్రి చేతులమీదుగా గౌరవపురస్కారం అందించి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో వపా చిత్రప్రదర్శన, వపా క్యాలెండర్లను ఆవిష్కరించారు. ఈ ప్రదర్శనలో ప్రదర్శించిన తమ వపా చిత్రాలకు కొసనా భాస్కరరావు, కదలి శ్రీనివాస్, చెల్లబోయిన రాము, నక్కా వెంకట్‌ను సత్కరించి ప్రశంసా పత్రాలను అందజేశారు.

'శ్రీకారం' పోస్టర్ విడుదల



పోస్టర్ విడుదల చేస్తున్న కిషోర్

పెనుగొండ: స్వీయ దర్శకత్వంలో షూటింగ్ పూర్తి చేసుకున్న శ్రీకారం షార్ట్ ఫిలింను జనవరిలో విడుదల చేయనున్నట్లు వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి వైట్ల కిషోర్ కుమార్ తెలిపారు. శనివారం ఆచంటలో నిర్వహించిన సమావేశంలో శ్రీకారం పోస్టర్ విడుదల చేసి, వివరాలు వెల్లడించారు. సహకరించిన నటులకు, నాయకులకు, మాజీ మంత్రి చెరుకువాడ శ్రీరంగనాధరాజుకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. నటీనటులు దేవిరెడ్డి రాంబాబు, దేవరపు సూర్యనారాయణ, మంగిన శ్రీనివాస్, హీరోలు అరిగేల సురేష్ బాబు, ఎం అర్జున్, వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు పెచ్చెట్టి సత్యనారాయణ, ఎంపీటీసీ తప్పెట్ల విజయకుమారి వెంకట్రావు, నెక్కంటి రామలింగేశ్వరావు, కుక్కల కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

గ్రామాల్లో పరిశుభ్రతకు ప్రాధాన్యత



భీమవరంలో చెత్తసేకరణ వాహనాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్

సాక్షి, భీమవరం: గ్రామాల్లో సంపూర్ణ పారిశుధ్యానికి పంచాయతీలు ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ సూచించారు. వీరవాసరం మండలం కొణితివాడ గ్రామంలో చెత్త సేకరణకు గ్రామ పంచాయతీ నిధులు రూ.3.20 లక్షలతో కొనుగోలు చేసిన రెండు వాహనాలను శనివారం స్థానిక క్యాంపు కార్యాలయంలో ఆయన ప్రారంభించి మాట్లాడారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేసి చెత్త రహిత గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ నాగరాజు శ్రీనివాసరాజు, ఎంపీటీసీ పెంటకోటి సైదేశ్వరరావు, బీసెట్టి కోటేశ్వరరావు, నాగరాజు గోపాలరాజు, కోటిపల్లి బాబు, కొల్లి ప్రసాద్, చిగురుపాటి సందీప్ తదితరులు పాల్గొన్నారు.

బాస్కెట్‌బాల్ క్రీడాకారులకు శిక్షణ



బాస్కెట్‌బాల్ క్రీడాకారులతో మాట్లాడుతున్న జగపతిరాజు

సాక్షి, భీమవరం: క్రీడల్లో రాణిస్తే ఉద్యోగ, ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకోవచ్చని స్థానిక ఎస్ఆర్‌కేఆర్ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.జగపతిరాజు విద్యార్థులకు సూచించారు. జనవరి 4న చెన్నైలోని మద్రాస్ యూనివర్సిటీలో నిర్వహించే సౌత్ జోన్ ఇంటర్ యూనివర్సిటీ బాస్కెట్‌బాల్ పోటీలకు ఎంపికైన జేఎన్టీయూ మహిళల టీంకు కళాశాలలో శిక్షణ పొందుతున్న క్రీడాకారులతో ఆయన మాట్లాడారు. కొందరు జూనియర్స్ స్థాయిలోనే జాతీయస్థాయిలో ప్రతిభ కనబరిచి సీనియర్స్ స్థాయిలో పోటీలకు హాజరవడం అభినందనీయమని అన్నారు. సౌత్ జోన్ పోటీల్లో విజయం సాధించి యూనివర్సిటీకి పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని ఆకాంక్షించారు. కళాశాల ఇన్‌చార్జి ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ సీహెచ్ హరిమోహన్ మాట్లాడుతూ జేఎన్టీయూ పరిధిలో వివిధ కళాశాలకు చెందిన మహిళా క్రీడాకారిణులకు ఇక్కడ శిక్షణ ఇస్తున్నామన్నారు. శిక్షణ పొందుతోన్న వారిలో షేక్ సహా హీరా, షేక్ నసీమా (నరసరావుపేట), వి.సాత్విక (భీమవరం), బి.కోటేశ్వరమ్మ, బి.ఉమా, షేక్ మస్తానీ (గుంటూరు), పి.హారిక (ఏలూరు), ఎం.దుర్గాంజలి, జి.సంధ్య (గుడ్లవల్లేరు), బి.మంజు, కె.వరలక్ష్మి (ఒంగోలు) ఉన్నారన్నారు. అసిస్టెంట్ ఫిజికల్ డైరెక్టర్ జి.సారిక పర్యవేక్షణలో బాస్కెట్ బాల్ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు.

బధిరుల పాఠశాలలో సంక్రాంతి సంబరాలు



సంక్రాంతి సంబరాలు నిర్వహిస్తున్న దృశ్యం

భీమవరం(ప్రకాశం చౌక్): శ్రీ వెంకటేశ్వర బధిరుల పాఠశాలలో మూగ చెవిటి విద్యార్థుల సమక్షంలో సంక్రాంతి సంబరాలను శ్రీ విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. స్కూల్ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ కె.శ్రీదేవి, మాట్లాడుతూ ప్రతి సంవత్సరం ప్రతి పండుగను తమ పాఠశాలలో పోటీలుగా నిర్వహిస్తున్న శ్రీవిజ్ఞాన వేదిక సంస్థను అభినందించారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ సంక్రాంతి సంబరాల్లో భాగంగా నిర్వహించిన ముగ్గుల పోటీల్లో 26 మంది విద్యార్థులు పాల్గొన్నారని చెప్పారు. విద్యార్థులకు ప్రముఖ వ్యాపారవేత్త, లయన్స్ క్లబ్ సభ్యుడు కట్టా నరసింహస్వామి ఆర్థిక సాయంతో బహుమతులు అందజేశామన్నారు. పోటీలను లయన్స్ క్లబ్ భీమవరం పట్టణ కార్యదర్శి నరహరిశెట్టి కృష్ణ, అధ్యాపకులు కె.శ్రీదేవి, ఎం.గాయత్రి, కె.విజయ, సి.అరుణ, కె.కీర్తన, వి.హరిప్రియ పర్యవేక్షించారు.

రేపు శ్రీవారి ఉత్తర ద్వార దర్శనం



బ్రోచర్లు విడుదల చేస్తున్న దృశ్యం

భీమవరం (ప్రకాశం చౌక్): హౌసింగ్ బోర్డు కాలనీలోని వెంకటేశ్వరస్వామి ఆలయంలో ముక్కోటి ఏకాదశి సందర్భంగా ఉత్తర ద్వారదర్శనం సోమవారం ఉదయం ఆరు గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు తదుపరి సాయంత్రం ఆరు గంటల నుంచి ఎనిమిది గంటల వరకు ఏర్పాటు చేసినట్లు ఆలయ అధ్యక్షుడు కంతేటి వెంకటరాజు తెలిపారు. లోక కల్యాణార్థం ఉదయం తొమ్మిది గంటల నుంచి సామూహికంగా విష్ణు సహస్రనామ పారాయణులు పద్మావతి మహిళా పారాయణం బృందం వారిచే నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకులు శ్రీనివాసచార్యులు పేర్కొన్నారు. ఈ మేరకు బ్రోచర్ విడుదల చేశారు. కార్యక్రమంలో కుక్కల బాల వెంకటరత్నం, తాడికొండ కోటేశ్వరరావు గుప్తా, చెరుకువాడ రంగసాయి, జానపాటి మధు, గొన్నాబత్తుల మల్లేశ్వరరావు, అల్లూరి బంగారురాజు, కడలి వెంకటేశ్వరరావు, కడలి ఫణి కుమార్ తదితర కమిటీ సభ్యులు భక్తులు పాల్గొన్నారు.

నిత్యావసర సరుకుల పంపిణీ



నిత్యావసర సరుకులు అందిస్తున్న దృశ్యం

భీమవరం (ప్రకాశం చౌక్): అరసవల్లి వెంకటాచారి, వెంకటాయమ్మ చారిటబుల్ ట్రస్ట్ సౌజన్యంతో పెద్దేటి వారి వీధిలో శనివారం ఉదయం పేదలకు బియ్యం తదితర నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాన్ని తహసీల్దార్ వై.రవికుమార్ ప్రారంభించి అరసవల్లి చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకులను అభినందించారు. ప్రముఖ వైద్యులు డాక్టర్ బసవ కృష్ణ ప్రసాద్, కల్పన దంపతులు మాట్లాడుతూ తాము కూడా ఇదే స్ఫూర్తితో కొంత ఆర్థిక సాయం అందిస్తామని తెలిపారు. శ్రీ విజ్ఞాన్ వెదిక కన్వీనర్ చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ దాత అరసవల్లి సుబ్రహ్మణ్యం పెద్దేటి వారి వీధిలో దివ్యాంగులు, అందులతో సహా 46 మందికి నిత్యావసర సరుకులను అందజేరని చెప్పారు. కార్యక్రమంలో దాత అరసవల్లి సుబ్రహ్మణ్యం, స్థానికులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలి



బూరుగుపల్లిలోని జగనన్న కాలనీలో ఇంటి నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న పెదపాటి పెద్దిరాజు

యలమంచిలి: జగనన్న కాలనీల్లో లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణం ప్రారంభించి త్వరితగతిన పూర్తి చేయాలని గృహనిర్మాణ కార్పొరేషన్ డైరెక్టర్ పెదపాటి పెద్దిరాజు కోరారు. హౌసింగ్ డే సందర్భంగా శనివారం బూరుగుపల్లి, కంచుస్తంభంపాలెం గ్రామాల్లోని జగనన్న కాలనీల్లో ఆయన పర్యటించి లబ్ధిదారులతో మాట్లాడారు. జగనన్న కాలనీల్లో ప్రభుత్వం స్థలం ఇవ్వడంతోపాటు రోడ్లు, విద్యుత్, తాగునీటి సౌకర్యం కల్పించినా లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణానికి ముందుకు రాకపోవడం సమంజసం కాదన్నారు. వారం రోజుల్లో ఇళ్ల నిర్మాణం ప్రారంభించనట్లయితే పట్టాలను రద్దు చేయాల్సి వస్తుందన్నారు. ఆయన వెంట గృహనిర్మాణ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వారణాసి సుబ్రహ్మణ్య సిద్ధాంతి, ఏఈ తెంటు వెంకట్రావు, ఎంపీడీఓ చివటం త్రిశూలపాణి, వైఎస్సార్ క్రాంతి పథం ఏపీఎం మళ్ల సోని, హౌసింగ్ వర్క్ఇన్‌స్పెక్టర్లు పుప్పాల పల్లపురాజు, శనాపతి శివ వెంకట సత్యనారాయణ ఉన్నారు.

పుంతలో ముసలమ్మ వార్షికోత్సవాలు

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలోని సీతారాంపేట, కొబ్బరితోటలో వేంచేసియున్న పుంతల ముసలమ్మ తల్లి 40వ వార్షిక మహోత్సవం కార్యక్రమాలు యువఫ్రెండ్స్ సర్కిల్ గౌరవాధ్యక్షుడు రాజా త్రినాథ్ ఆధ్వర్యంలో జనవరి 1వ తేదీ నుంచి 5వ తేదీ వరకు జరుగుతాయని శనివారం ఉత్సవ కమిటీ నిర్వాహకులు వెల్లడించారు. జనవరి 1న అమ్మవారికి విశేష పూజలు, లలిత సహస్ర పారాయణం, 2వ తేదీన చండి శాంతి హోమం, 3వ తేదీన సహస్ర జ్యోతిర్లింగార్చన, 4వ తేదీన శ్రీనివాస కల్యాణం, 5వ తేదీన రథోత్సవం, 10వ తేదీన అఖండ అన్నసమారాధన ఉంటుందని వెల్లడించారు.